నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, మంగళవారం 4 జూన్ 2024 RANGAREDDY

శంషాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్ తదితరులు

రాష్ట్ర సాధన, పదేండ్ల ప్రగతిలో..

కేసీఆర్ పాత్ర వెలకట్టలేనిది

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- జిల్లా పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి
- జిల్లాలో ముగిసిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

రంగారెడ్డి, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ, పదేండ్ల రాష్ట్ర ప్రగతిలోనూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర వెలకట్టలేనిదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. చివరి రోజైన సోమవారం శంషాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డితోపాటు ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్ యాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వీట్లను పంపిణీ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవ సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ప్రసంగించారు. రానేరాదన్న తెలంగాణను ప్రాణాలను పణంగా పెట్టి సాధించిన కేసీఆర్ పోరాట పటిమ, ఉద్యమ చతురత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. దేశ వ్యాప్తంగా 36 పార్టీలను ఒప్పించి తెలంగాణ ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చి అప్పటి యూపీఏ ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించిన చాణక్యరీతి అద్భుతమని పేర్కొన్నారు. కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత, మహిళలు, కార్మికులు, కర్షకులు, మేధావులందరినీ ఏకం చేసి రక్తపు చుక్కకు తావులేకుండా ఉద్యమాన్ని నిర్మించి రాష్ట్రాన్ని సాధించడం అద్భుత ఘట్టమని పేర్కొన్నారు. సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్ల సమర్థ పాలనలో అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలబెట్టారని కొనియాడారు. రాజకీయాల్లో ఒడిదుడుకులు, గెలుపు, ఓటములు సహజమేనని తెలంగాణ ఉన్నంతకాలం తెలంగాణను తెచ్చిన గులాబీ జెండా రెపరెపలాడుతూనే ఉంటుందన్నారు. గాలివాటంగా, అబద్ధాలతో గెలిచిన కాంగ్రెస్ పాలకులు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అబద్ధాలనే నమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ ఒరవడిని కొనసాగించకుంటే కాంగ్రెస్ పార్టీ అనతికాలంలోనే కనుమరుగవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బూత్ స్థాయి నుంచి పార్టీ పటిష్టంగా ఉన్నదని, కిందిస్థాయి నుంచి పార్టీ కమిటీలన్నింటినీ బలోపేతం చేసి సంస్థాగత బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, దశాబ్ది ఉత్సవాల ప్రేరణతో ఉద్యమ స్ఫూర్తితో పని చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వేడుకల్లో జడ్పీటీసీలు నీరటి తన్విరాజు, అనురాధ, దశరథ్ నాయక్, ఎమ్మె శ్రీలత, రాగమ్మ రామకృష్ణ, ఎంపీపీలు జయమ్మ, నర్మద, మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మ, గజ్జెల మధుసూదన్‌రెడ్డి, గణేశ్‌గుప్తా, వెంకటేశ్ గౌడ్, చంద్రారెడ్డి, సతీశ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం

నేడే.. ఓటరు తీర్పు

- చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల బరిలో 43 మంది అభ్యర్థులు
- త్రిముఖ పోటీలో గెలుపుపై సర్వత్రా ఉత్కంఠ
- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా ఎన్నికల అధికారులు
- చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్‌లో ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్‌కు 165 టేబుళ్లు..పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేక టేబుళ్లు
- ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు మొదలు
- ముందుగా పోస్టల్ బ్యాలెట్లు, ఆతర్వాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ విధుల్లో 777 మంది ఎన్నికల సిబ్బంది
- హ్యాట్రిక్ థీమాలో బీఆర్ఎస్ పార్టీ

రంగారెడ్డి, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఫలితం వెలువడేందుకు ఇంకా కొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల బరిలో 43 మంది నిలువగా.. ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్నది. ఈ ఎన్నికల్లో 16,57,107 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా.. విజేత ఎవరో నేడు తేలనున్నది. చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం 165 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలు కానున్నది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి.. 8.30 గంటల నుంచి ఈవీఎంలలోని ఓట్లను లెక్కించనున్నారు. సాయంత్రం 3 గంటల లోపు తుది ఫలితం వెలువడే అవకాశం ఉంది. 777 మంది ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ విధులను నిర్వర్తిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు చర్యలను చేపడుతున్నది.

ఒక్కో రౌండ్‌కు 15 నిమిషాలు..

చేవెళ్ల లోక్‌సభ బరిలో 43 మంది అభ్యర్థులు ఉండడంతో ప్రతి పోలింగ్ కేంద్రంలో మూడు ఈవీఎంలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 56.40 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 29,38,370 మంది ఓటర్లకుగాను 16,57,107 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓట్ల కౌంటింగ్ కోసం 164 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. అత్యధిక పోలింగ్ కేంద్రాలు ఉన్న మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు కోసం 28 చొప్పున టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తుండగా.. మిగతా నాలుగు నియోజకవర్గాల్లో 14 చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 25 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి టేబుల్ వద్ద ఓ సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులు, సూక్ష్మ పరిశీలకుడు ఉంటారు. ఈ లెక్కన చేవెళ్ల లోక్‌సభ ఓట్ల లెక్కింపు కోసం 777 మంది ఎన్నికల సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఇందులో కౌంటింగ్ సూపర్‌వైజర్లు 227 మంది, కౌంటింగ్ అసిస్టెంట్స్ 273 మంది, మైక్రో అబ్జర్వర్లు 277 మంది ఉన్నారు. ఓట్ల లెక్కింపులో ఒక్కో రౌండ్‌కు 10 నుంచి 15 నిమిషాల సమయం పడుతుంది. అంటే గంటకు నాలుగు రౌండ్లు పూర్తవుతాయి. ఓట్ల లెక్కింపు పూర్తయ్యాకే రౌండ్ల వారీగా ఓట్లను క్రోడీకరించి ఫలితం ప్రకటిస్తారు. ఏఆర్‌వోతోపాటు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ప్రత్యేకంగా వచ్చిన పరిశీలకుల పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ కొనసాగుతుంది.

ఎవరి థీమా వారిదే..

చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ నుంచి రంజిత్ రెడ్డి, బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పోటీపడ్డారు. ప్రధానంగా ఈ మూడు పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్నది. ఎవరికి వారుగా విజయవకాశాలపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల నుంచే లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించడం.. కేటీఆర్ రోడ్డుషోలు వంటి కార్యక్రమాలు బీఆర్ఎస్ పార్టీ పుంజుకున్నదని నేతలు పేర్కొంటున్నారు.

గత పదేండ్లలో బీఆర్ఎస్ పాలనతో కాంగ్రెస్ ఐదు నెలల పాలనను పోల్చుకుని ప్రజలు 'కారు' వైపే మొగ్గు చూపారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే రెండు సార్లు వరుసగా గెలిచిన బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్‌పై గంపెడాశలు పెట్టుకున్నది. ఏదేమైనా.. నిశ్శబ్ద విప్లవంలో ఓటర్లు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలలో ఏ పార్టీవైపు మొగ్గు చూపారన్న విషయంలో సర్వత్రా ఉత్కంఠత నెలకొన్నది. ఈ ఉత్కంఠ వీడాలంటే మంగళవారం సాయంత్రం వరకు వేచి చూడక తప్పదు.

ఓట్ల కౌంటింగ్ కోసం నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన టేబుళ్ల వివరాలు :

నియోజకవర్గం	పోలైన ఓట్లు	కౌంటింగ్ సెంటర్	పోలింగ్ కేంద్రాలు	టేబుళ్లు	రౌండ్లు	సిబ్బంది
మహేశ్వరం	2,93,472	బ్లాక్ బీ, 1వ అంతస్తు	537	28	20	87
రాజేంద్రనగర్	3,31,318	బ్లాక్ ఏ, 2వ అంతస్తు	543	28	20	87
శేరిలింగంపల్లి	3,32,853	బ్లాక్ బీ, గ్రౌండ్ ఫ్లోర్	633	28	23	87
చేవెళ్ల	1,93,911	బ్లాక్ ఏ, 1వ అంతస్తు	298	14	22	45
పరిగి	1,78,637	బ్లాక్ బీ, 2వ అంతస్తు	305	14	22	45
వికారాబాద్	1,63,167	బ్లాక్ బీ, 2వ అంతస్తు	284	14	21	45
తాండూరు	1,63,749	బ్లాక్ బీ, 3వ అంతస్తు	277	14	20	45
పోస్టల్ బ్యాలెట్	19,290	బ్లాక్ ఏ, 1వ అంతస్తు	-	25	02	78
మొత్తం	16,57,107	-	2,877	165	150	519

కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలి

- కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- అబ్జర్వర్లతో కలిసి కౌంటింగ్ సెంటర్ పరిశీలన

కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక సూచించారు. చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాన్ని సోమవారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్ కుమార్ కటారియా, కౌంటింగ్ పరిశీలకులు మృణాళినీ సావంత్, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డిలతో కలిసి రిటర్నింగ్ అధికారి శశాంక పరిశీలించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను సందర్శించారు. ఆయా కౌంటింగ్ హాళ్లలో టేబుళ్లు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ జరపాలని సహాయ రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ శశాంక సూచించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా నిబంధనలను తప్పకుండా పాటించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా లెక్కిస్తూ.. ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరి చేస్తారని, కౌంటింగ్ ప్రక్రియను యథాతథంగా కొనసాగించాలన్నారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం నియమించబడిన వారికి పాసులు అందించాలని, పాసు కలిగి ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్‌లోకి అనుమతించాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. రిటర్నింగ్ అధికారి వెంట అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, చేవెళ్ల డీసీపీ శ్రీనివాస్, అసెంబ్లీ నియోజకవర్గాల సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్‌లో రైతుల ధర్నాతో స్తంభించిన ట్రాఫిక్

మోసపోయాం.. ఆదుకోండి..

విలేకరులకు తమ గోడును వినిపిస్తున్న రైతు

- ఫర్టిలైజర్ దుకాణం ఎదుట రైతుల ధర్నా
- నాసిరకం వరి విత్తనాలు అంటగట్టడంతో దిగుబడి తగ్గిందని ఆగ్రహం
- నష్ట పరిహారం ఇప్పించాలంటూ పట్టుబట్టిన అన్నదాతలు

కొడంగల్, జూన్ 3: అధిక దిగుబడి వస్తుందని నమ్మించి నాసిరకం వరి విత్తనాలు అంటగట్టడంతో తీవ్రంగా నష్టపోయామని, నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైతులు సంబంధిత ఫర్టిలైజర్ దుకాణం ఎదుట ధర్నా చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. యాసంగి పంటకు సంబంధించి కొడంగల్ పట్టణంలోని ఓం ట్రేడింగ్ కంపెనీ దుకాణదారుడు యాసంగిలో విజయదుర్గా కంపెనీకి చెందిన వరి విత్తనాల వల్ల ఎకరాకు 100 నుంచి 120 బస్తాల వరకు పంట దిగుబడి వస్తుందని, అదేవిధంగా ప్రత్యేకమైన ఫర్టిలైజర్ వాడితే మంచి లాభం ఉంటుందని రైతులను నమ్మించి విక్రయించాడు. కాగా పంట కోత దశలో ఎకరాకు కనీసంగా 30 బస్తాల వరి ధాన్యం కూడా చేతికి అందలేదని రైతులు వాపోయారు. ఎకరాకు దాదాపుగా రూ.9వేలకు పైగా విలువైన మందులు వాడినట్లు రైతులు తెలిపారు. చేతికి అందివచ్చిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదని, దీంతో చాలా తక్కువ ధరకు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నామన్నారు. అటు నాసిరకం ధాన్యం, ఇటు ప్రస్తుతం ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తీవ్రంగా నష్టపోయామన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై దుకాణదారుడిని ప్రశ్నించగా అవి కంపెనీకి చెందిన విత్తనాలని, వాటితో తమకు ఎటువంటి సంబంధం ఉండదని చెప్పారు. కంపెనీ వాళ్లను సంప్రదించి నష్టపరిహారం కోరనున్నట్లు తెలిపారు. దాదాపుగా గంటపాటు సాగిన ధర్నాతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు, వ్యవసాయాధికారులు అక్కడి చేరుకొని కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

పెద్దలకూ బీసీజీ టీకా

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శ్రీకారం
- పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన 17 జిల్లాల్లో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు
- ఒక డోసు టీకా ఇచ్చేందుకు ఏర్పాట్లు
- ఇంటింటి సర్వేతో వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ డాక్టర్లు, సూపర్‌వైజర్లకు మొదలైన శిక్షణ

రంగారెడ్డి, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ఇప్పటివరకు పిల్లలకు బీసీజీ వ్యాక్సిన్ ఇస్తుండగా.. తొలిసారిగా 18 ఏండ్లు పైబడిన వారికీ ఇచ్చేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయించింది. 2025 నాటికి క్షయ నిర్మూలనే లక్ష్యంగా.. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. ఇప్పటికే దేశంలో తొలివిడుతగా ఎనిమిది రాష్ట్రాల్లో వ్యాక్సినేషన్ మొదలైంది. మలి విడుతలో రాష్ట్రంలో 17 జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. ఇందులో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు ఉన్నాయి. బీసీజీ వ్యాక్సినేషన్ కార్యాచరణలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో సోమవారం ప్రభుత్వ దవాఖానలకు చెందిన డాక్టర్లు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇచ్చారు.

కట్టడి చేసేలా కార్యాచరణ..

క్షయ వ్యాధి క్రమంగా విస్తరిస్తున్నది. వ్యాధి సోకినవారు సరైన పోషకాహారం, క్రమం తప్పకుండా మందులు వాడితే నయం చేయవచ్చు. లేదంటే ఈ వ్యాధితో ప్రాణానికే ప్రమాదం. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో ఈ వ్యాధి వేగంగా విస్తరిస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఈ వ్యాధి కట్టడికి అనేక చర్యలు తీసుకుంటూ వస్తున్నది. తాజాగా.. కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్దేశానికి అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నది. క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో 18 ఏండ్లు పైబడినవారికి బీసీజీ టీకాను ఇవ్వనున్నారు. గుర్తించిన వ్యాధిగ్రస్తులకు ఒక డోసు టీకా ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎవరెవరికి టీకా ఇవ్వాలని గుర్తించేందుకు ఆరు కేటగిరీలను నిర్దేశించుకుని ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. జూలై చివరి వారం లేదా ఆగస్టు మొదటి వారంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ మొదలుకానున్నది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్, వ్యాక్సినేషన్ కేంద్రాల్లో టీకాను ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి వివిధ స్థాయిల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

బీసీజీ టీకాతో ఎలాంటి దుష్ఫలితాలు ఉండవు

–జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్ రావు

బీసీజీ టీకా వల్ల ఎటువంటి దుష్ఫలితాలు ఉండవని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. పెద్దలలో టీబీ వ్యాధి నివారణ కోసం తయారైన బీసీజీ టీకా అధ్యయన కార్యక్రమంపై రంగారెడ్డి జిల్లాలోని కామినేని ఆసుపత్రి ఇందిరా ఆడిటోరియంలో పీహెచ్‌సీ, పల్లె దవాఖాన, బస్తీ దవాఖానలకు చెందిన డాక్టర్లు, సూపర్ వైజర్లకు సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ 60 ఏండ్లు పైబడినవారందరికీ, బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్నవారు, మద్యం తాగేవారు, ఇప్పుడు పొగ తాగుతున్నవారి, గతంలో పొగతాగిన వారు ఈ టీకా వేసుకునేందుకు అర్హులని అన్నారు. క్షయవ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా ఉన్నవారు, గత ఐదేండ్లలో క్షయ వ్యాధిగ్రస్తులున్న ఇంట్లోని ఇతర కుటుంబ సభ్యులు టీకా వేసుకోవచ్చునని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా క్షయనియంత్రణాధికారి డాక్టర్ అరుణ కుమారి, యూఎన్‌డీపీ, ఎన్‌పీఎస్‌పీ ప్రతినిధులు డాక్టర్ స్నేహ శుక్లా, డాక్టర్ సుమలత, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ గీత, డాక్టర్ వినోద్, డాక్టర్ అనిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంబిక తదితరులు పాల్గొన్నారు.